# దాసరిపాట

అతడు తెలగదాసరి. అతని నివాసస్థలము తెలుగుదేశము. అతని పరివారము, చుట్టములు, అతని భార్యే. అతని ఆస్తి ఒక తాంబ్రా, ఒక గుమిసీ, ఒకజత అంజెలులు.

అతని దృష్టి యెప్పుడూ పదములలో దాగియున్న తెలుగు వీరుల మీదనే. అతని ఆశయము ఎప్పుడూ తెలుగు దేహములను పదములు పాడి పులకలెత్తించడమే.

అతడు చూడని తెలుగు గ్రామములేదు. అతడు మెట్టని తెలుగు దేశములేదు. అతని పాటలు వినని తెలుగువారులేరు — కొందరు నవనాగరీకులుతప్ప.

మరాఠీ మనుష్యులవలె యెఱ్ఱని పెద్ద తలపాగా పెట్టుకొని చిరిగి పోయిన పాతకోటు వేసుకొని పాత జరీకండువా వల్లెవాటుగా ధరించి పంచె యెగగట్టి బుజముమీది తాంబ్రా వేళ్ళతో మీటుతూ మెళ్ళో పూసలు కదిలేటట్టు చిందులు తొక్కుతూ అతడు మరాఠీ కథ పదము చెప్పే టప్పుడు వీరరసము ఉట్టిపడేది. అతని బొమముడికి పెట్టుకొన్న నామము పెచ్చులు పెచ్చులుగా ఊడిపోయేది. బొటనవేలుకి తర్జనకీ తగిలించుకొన్న అంజెళ్ళు ఖంగున మోగేవి. పక్కనే కూర్చున్న అతని భార్య గుమిసిమీద మోకాలు పెట్టి భర్త ముఖముమీదనే వీక్షణములుంచి గుమిసి వాయించునపుడు భర్త చెప్పు పదమునకు మరింత గాంభీర్యము వచ్చేది. జనులు ముగ్ధులైపోయేవారు.

అతనికి యిరవయ్యోయేట పెళ్ళైనది. పెళ్ళైనది మొదలు నేటి వరకూ అతని భార్య అతనివద్దనే ఉన్నది. పెండ్లినాటి కామెకు

పద్దాలుగోయేడు. అమె తండ్రికూడా ఒక తెలగదాసరే. కాని అతడు అకాలమృత్యువువాత పడుటచేత ఆమె తల్లివద్దనే ఉండి చాలా దర్శిద్ర మనుభవించింది. కాని కొన్ని పదములు నేర్చుకుంది. తల్లిదగ్గిరనున్న కాలములో ఆమెకు తల్లే సర్వమున్నూ. పెళ్ళిచేసుకున్న తర్వాత ఆమెకు భర్తే సర్వమూ. భర్త దగ్గిర ఆమె గుమిసీ వా ంచడం నేర్చుకుంది, భర్త దగ్గిర ఆమె కొత్తపదము లనేకములు నేర్చుకొన్నది. భర్త పాడేటప్పుడు అతని పాటకు తాను ఊతపదమును కలిపేది. వారి హృదయాలకు అద్వితీయస్థితి లేనట్టే వారి పాటకుకూడా లేదు.

పదములోని వీరరసమును భర్త వెలువరించేటప్పుడు ఆమె హృదయము వీరరసముతో ఉప్పొంగేది.

కరుణారసము తన పదమునకు భర్త ఒప్పించేటప్పుడు ఆమె కళ్ళవెంబడి వచ్చిన కన్నీళ్ళు గుమిసీని తడిపేవి. 'తందానతాన' అనే ఊతపదము గద్గదమయ్యేది.

భర్త చమత్కారము చూచి చిరునవ్వు నవ్వినప్పుడు ఆమె గుమిసీ దెబ్బలలో నవ్వు వినిపించేది.

కొంటెతనముతో అతడు మీసముమీద చెయ్యివేసి నాయికా నాయకుల శృంగారమును వర్ణించేటప్పుడు ఆమె తలవంచి గుమిసీ తప్పు వాయించేది.

భేదములేనివారి ప్రేమకు. కౌటిల్యమెరుగనివారి ప్రేమకు, దేహములు వేరైనను వారి ఆత్మలను ఒక్కటిగ చేసినవారి ప్రేమకు ఫలముగా వారికి ఒక కొడుకు పుట్టాడు. వానికి ఇప్పుడు ఐదోయేడు

చదువుకున్నవాడంటే ఎవరు? వ్రాలు చేయగలవాడేనా! వ్రాలు చేయలేని భట్రాజులు, దాసరులు, జంగములు, సాతానులు, వీధిభాగవతులు — వీరిమాటేమిటి? భారత భాగవతములను, మహావీరుల దేశీయ కథలను ఇతరులకు బోధించగల వీరు చేవ్రాలు చేయలేనివారనే కారణంచేత చదువురానివారని త్రోసివేయవచ్చునా? దేశములో కొందరు విద్య

లను పోషించవలెను. కొందరు వృత్తులను పోషించేవారికి చదువులలో నిగ్గు తెలియాలి. దానికోసము సంఘములో కొందరు ఏర్పాటు కావాలి. భట్రాజులు, దాసరులు మున్నగువారు ఇట్టివారు. వీరు సర్వసౌఖ్యములను పరిత్యజించి భిక్షుకవృత్తి అవలంబించేరు పూర్వము. ముఖ్యముగా మత ప్రచారముకొరకై వారూరూరు తిరుగుతూ భిక్షుకులై దేశములోని అజ్ఞానమును ఒకవిధముగా పోగొట్టుచున్నారు. వీరిని చూచి నేటివారు 'కూలిపని చేసుకోకూడదా?' అనడం ఆచారమైనది. వంశపారంపర్యంగా వస్తూన్న ఆచారాలని వొక్కమారు వదలిపెట్టడం కష్టం. అయినా వారికి భైక్ష్యవృత్తి నీచముకాదు; వారి దేవుడే వొక భిక్షకుడుకాబట్టి.

ఈకాలపు ముద్రాశాలలకన్న వీరే సంఘమునకు ఎక్కువ ఉపయోగకరంగా ఉండేవారు. అచ్చుయంత్రము చదువు వచ్చినవారికే, వీరు అందరికీ ఉపకారము చేస్తున్నారు.

మనదాసరి చాలా పాటలు పాడగలడు. బొబ్బిలికథ, తిమ్మరాజుకథ, కోడిపుంజులకథ, సర్వాయపాపడుకథ. కామమ్మకథ, కాంభోజరాజుకథ, చెంచుకథ మొదలైన కథలనేకములు రసవత్తరముగా వినిపించగలడు. ఈ పదములన్నీ ఇతని భార్యకుకూడా వచ్చును. వీరి అయిదేండ్ల కొడుకుకు అప్పుడే అయిదారు కథలు వొక మోస్తరుగా పాడడము వచ్చును.

ఇంతవరకు వీరిని భగవంతుడు ఆదరముతోనే చూచేడు. ఎక్కడికి వెళ్ళినా వీరికి కడుపునిండా తిండి దొరికేది, తగిన బహుమానము దొరికేది. ఈ దాసరి దంపతులకు మొదట వొకరిమీద వొకరికి ఎంత అనురాగముండేదో వారి పాటలమీద కూడా వారికి అంత అనురాగమే ఉండేది. ఇప్పుడు వారిద్దరూ వారి పాటలకన్న వారి కొడుకుని ఎక్కువ అనురాగముతో చూచుకొంటున్నారు. కొడుకును వొకరువిడిచి వొకరు ఎత్తుకొనేవారేగాని నడిపించేవారుగారు. తమకు వొకముద్ద తక్కువ చేసుకునైనా తమ కొడుకు కడుపు నిండించేవారు. అసాధ్యమైన కోరికలు చెల్లించి ఆ పూటకి ఉపవాసము చేయడముకూడా అప్పుడప్పుడు కద్దు.

ఒకనాడు వొక గ్రామములో దాసరి దంపతులు కోడిపుంజులకథ చెప్పుచున్నారు. దాసరి కూర్చుని ఉన్నాడు. అతని ప్రక్కనే అతని భార్య వాద్యము వాయించుచున్నది. ఆమెవొడిలో వారి పుత్రుడు పడుకున్నాడు. దాసరి చూపులు అతనిమీదనే తరుచుగా పడుచున్నవి. ఆమె పిల్లవాణ్ణి ఉండుండి అక్కున చేర్చుకొనుచూ ఊతపదము పలకడం మరిచిపోయేది. కోడిపుంజుల యుద్ధము వర్ణించేటప్పుడు చూపే ఉత్సాహము దాసరి ఆరోజున చూపలేకపోయేడు. రాజపుత్రుల పౌరుషవాక్యములు ఆనాడు నీరసములైనవి. ప్రజలందరు అతని పాటనువిని పెదవి విరుచుకొన్నారు. కొందరు ముసలివాడైనాడితడు, 'ఇక పదములు చెప్పలే'డన్నారు. గర్వము బలిసినదన్నారు మరికొందరు ఇతన్నిచూచి.

ఆరోజున వారికి రావలసినంత ఆదాయము రాలేదు.

అరోజుకు సరిపడేటంత ఆదాయమైనా రాలేదు.

రాత్రి ఘూడుగంటలైనది. కథముగిసినది. ప్రజలందరు ఇండ్లకు వెళ్లిరి. దాసరి తనకొడుకు వొంటిమీద చెయ్యివేసి చూచేడు. వొళ్ళు కాలిపోతూంది. దాసరిభార్య తనకొడుకు కాలికివున్న కట్టువిప్పినది. దాసరి ఏదో పసరుముద్ద కాలిమీది గాయముమీద వేసినాడు. ఆమె మళ్లీ కట్టు కట్టినది. దాసరి తన తలపాగా మెత్తగా వుండేటందుకు పక్కవేసేడు. దానిమీద తన కోటు పరిచేడు. దాసరిభార్య తనకొంగు ఆ ప్రక్కమీద వేసి దానిమీద బాలుని పడుకోబెట్టి అతనిపక్కనే తాను పడుకొన్నది. ఈవలిపక్క దాసరి రాళ్ళమీద పడుకున్నాడు. తూర్పున ఉదయించిన చంద్రవంక మేలుకొనియున్న దంపతుల కన్నీటి బిందువులలో ప్రకాశించింది. ఊరుబయట చెట్టుక్రింద పడుక్కొనివున్న దాసరి కుటుంబమునకు మరునాడు పాటపాడితేనేగాని పొట్టనిండదు.

రాత్రి యెనిమిది గంటలైంది. రెండు కిర్సనాలుదీపాలు ఊరి చివర చెట్టుక్రింద వెలుగుచున్నవి. చుట్టూ ప్రజలు కూర్చుని ఉన్నారు.

దాసరి వొక బుజముమీద తాంబ్రా మీటుతున్నాడు. బొబ్బిలికథ చెప్పు తున్నాడు. కూర్చునే చెప్పుతున్నాడు. యధాప్రకారము అతని భార్య అతని ప్రక్కనే కూర్చున్నది. బుజముమీది వారికొడుకు చిక్కి శల్యమై యున్నాడు. కాలిమీది కట్టు మరింత పెద్దదిగా ఉన్నది. ఉండుండి అతడు తలయెత్తి తండ్రికేసి, తల్లికేసి చూచి మళ్ళీ బుజముమీద తల వాల్చి కూర్కుచున్నాడు. ఆ రోజున జ్వరము తగినదని తల్లికి ఆశ కల్గినది. ఆరోజున జ్వరము తగ్గినదని తండ్రికి బెంగగాఘంది. బొబ్బిలి కథ క్రమక్రమముగా రక్తికట్టుచున్నదని ప్రజలనుకొనుచున్నారు. బొబ్బిలికోట ముట్టడించడానికి సైన్యములు పూనుకొనుచున్నవి. యుద్ధ మును వర్ణించి దాసరి ప్రజల మెప్పును పొందేడు. రంగారావు వీరకృత్య ములు ప్రజలలో ఆవేశమును కలిగించినవి. తాంబ్రా తీగెలు కదలిపోవు చున్నవి. గుమిసి ఖంగుమనుచున్నది. దాసరి యెలుగెత్తి రంగరాయ మరణమును విలపించాడు. ప్రజలకు కళ్ల నీళ్ళు గిర్రున తిరిగినవి. తల్లి బుజము మీదనున్న కొడుకు వొంటిమీద చెయ్యివేసి చూచినది వొళ్ళు చల్లబడుచున్నది. దాసరి ముఖముకేసి చూచినది. అతడు విజయరామ రాజు క్రౌర్యమును వర్ణిస్తున్నాడు. కొడుకు హీనస్వరముతో 'అయ్యా' అన్నాడు. ఒకచేతితో సానురాగముగా కొడుకును నిమిరి అతడు కథ సాగించాడు.

తాండ్ర పాపయ్యకు బొబ్బిలి వీరుల మరణవార్త తెలిసినది. రౌద్రాకారుడై వచ్చి అతడు విజయరామరాజును చంపిన వార్త దాసరి పాడి ప్రజలకు తెలియజెప్పాడు. ప్రజలు తలవూపినారు. కాని అను కొన్నంత రసవంతముగ పాపయ్య శౌర్యమును వర్ణించలేకపోయినా డేమిచెప్మా అనుకొన్నారు ప్రజలు.

తల్లి తనకొడుకు వంటిమీద మళ్ళీ చెయ్యివేసి చూచినది. దాసరి తాంబ్రా కిందపెట్టి రెండుచేతులతోను కొడుకు నెత్తుకొని రెండో బుజము మీద వేసుకొన్నాడు. వేసుకొని బిక్కమొగముతో భార్యవంక తిరిగి చూచేడ

పాపయ్య బంధువుల మరణమునకై ఎన్నడూ ఎప్పుడూ విలపించనట్లు ఆరోజున విలపించేడు. దాసరి పాడిన పాట ఇంత కరుణామయముగా ఎప్పుడూ లేదని అనుకొన్నారు ప్రజలు. పాపయ్య[illegible] పాటు దాసరితో పాటు ప్రజలుకూడా కన్నీళ్ళు విడిచి విలపించారు.

ఆనాడాదాసరి ఆలపించిన విలాపగీతికకు దాసరి హృదయ తంత్రులే తంబురాతీగలై శ్రుతికలిపినవి.

ఆనాడాదాసిరి ఆలపించిన విలాపగీతికకు ఆ తల్లి [illegible] హృదయముమీద చేతులతో గుమిసి వా ఖుంచింది.

(1927)

—:o:—